# ప్రార్థనకు జవాబు లేని కారణాలు

"మీరు అడిగినను ... మీ కేమియు దొరుకుటలేదు" (యాకోబు 4:3ఎ). ఇది ఎంత తరచుగా సత్యమైయున్నది! తాము అడిగినవి పొందనందున కొంత మంది దేవునియందు సంపూర్ణంగా తమ విశ్వాసాన్ని కోల్పోయారు. యింకా యితరులు అదే కారణాన్నిబట్టి సందేహం కలిగియుంటారు. ప్రార్థనకు జవాబు రాని కారణాన్ని బట్టి దేవుని నిందించ వలసిన అవసరం లేదు. మనం దానికొరకు వెదకినట్లయితే, న్యాయ సమ్మతమైన పరిష్కారం ఎల్లప్పుడు ఉంటుంది. ప్రార్థనలకు జవాబులు రాని కారణాలేమి?

## ప్రార్థన చేస్తున్నవాడు ప్రార్థించడానికి అయోగ్యుడా?

ప్రార్థించడానికి ఒక వ్యక్తి అయోగ్యుడనే ఒక విషయం ఉంది. మొదటిగా, ప్రార్థించేవాడు దేవుని బిడ్డ కాకపోతే యిది సత్యమే. ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము క్రీస్తులో ఉంది (ఎఫెసీ. 1:3). క్రీస్తునకు వెలుపలనున్న వానికి ఆత్మ సంబంధమైన ఏ ఆశీర్వాదము వాగ్దానం చేయబడలేదు. దేవుని బిడ్డ చేసినట్టుగా ప్రార్థించే ఆధిక్యత అతనికి లేదు. "ధర్మశాస్త్రము వినబడకుండ చెవిని తొలగించుకొనువాని ప్రార్థన హేయము" అని మనం చదువుతాం (సామె. 28:9). నీచమైన పాపములు చేసేవారి విషయంలో అది సత్యమే, మంచి ప్రవర్తనగలవారైయుండియు క్రీస్తులోనికి రానివారి విషయంలో కూడా యిది సత్యమే.

సత్యంలోనికి నడిపించుమని దేవుని వేడుకొనిన కొర్నేలీవంటి వ్యక్తులు ఈలాటి చట్టంనుండి మినహాయింపబడ్డారు (అపొ. 10:1-48). అతనికి సువార్త ప్రకటించుటకు పేతురును పంపుటచే దేవుడతని ప్రార్థనకు బదులిచ్చాడు.

రెండవది, ఏదో ఒక సమయంలో ఒక వ్యక్తి సువార్తకు లోబడియుండవచ్చు కాని అతడు అంగీకారయోగ్యంగా ప్రార్థించలేడు ఎందుకంటే అతడు క్రైస్తవ జీవితాన్ని జీవించడం లేదు. దేవుని సహవాసంనుండి అతడు తొలిగిపోయి ఉండవచ్చు. నీతిమంతుని ప్రార్థన "బహు బలముగలదై" యుంటుంది (యాకోబు 5:16). ప్రార్థించడానికి హక్కును కలిగియుండడానికి ముందు దోషియైన దేవుని బిడ్డ మారుమనస్సు పొందాలి (అపొ. 8:22).

ఇతరుల యెడల తప్పు స్వభావము కలిగియుండడంవలన మన ప్రార్థనలకు తరచుగా అంతరాయం కలుగుతుంది. మనయెడల పాపము చేసిన వారిని క్షమించునంతమేరకు మన పాపక్షమాపణకొరకు మనం ప్రార్థన చేయవలసియుంటాం (మత్తయి 6:12). దేవునికి అర్పణ చెల్లింపకమునుపు సహోదరునితో సమాధానపడవలసియున్నట్టు ప్రభువు బోధించాడు (మత్తయి 5:24). వారి "ప్రార్థనలకు అభ్యంతరము కలుగకుండునట్లు" భర్తలు తమ భార్యలను సన్మానించాలని పేతురు తెలిపాడు (1 పేతురు 3:7).

ప్రార్థనకు జవాబురాలేదంటే, విశ్వాస హృదయంనుండి అది బయలుదేరింది కాకపోవచ్చు. కొన్ని సార్లు మన ప్రార్థనలకు జవాబులు రాలేదంటే, అవి వస్తాయని మనం ఎదురు చూడకపోవచ్చు! మన ప్రార్థనలు విశ్వాసపు ప్రార్థనలైయుండాలి. "విశ్వాసంతో అడుగు." సందేహించువాడు "గాలిచేత రేపబడి యెగిరిపడు సముద్ర తరంగమును పోలియుండును" (యాకోబు 1:6). ప్రార్థన ఆసక్తితో ఉండాలి – కాని సోమరితనంగానో, సంకుచితంగానో, లేక పట్టీపట్టనట్టుగానో కాదు (యాకోబు 5:16). దేవునితో మాట్లాడడం "ప్రార్థనను వల్లించడంకంటె" మిన్నయైనది.

## ప్రార్థన దేవుని చిత్తమునకు విరోధమైనదా?

ప్రార్థనకు జవాబురాని కారణంకొరకైన మన పరిశీలనలో, ఆలోచింపవలసిన రెండవ ప్రశ్న యిక్కడ ఉంది: ప్రార్థన దేవుని చిత్తానుసారంగా ఉందా? "ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించును ..." అని యోహాను వ్రాశాడు (1 యోహాను 5:14బి).

మనకు హానికరమైన దేనికొరకైనా మనం ప్రార్థిస్తున్నామా? అలాగైతే, దేవుడు దానిని ఆపు చేయాలి. మనకు అంతరాయం కలిగించే దేనిని ఆయన ప్రసాదించడు. ఎక్కువ అంగీకారయోగ్యంగా మనం ప్రార్థించగలుగునట్లు దేవుని వాక్యాన్ని చదివి ఆయన చిత్తాన్ని గ్రహించాలి. ఆయన చిత్తాన్ని గూర్చి బహు తక్కువగా ఎరిగినందున అంగీకారయోగ్యమైన ప్రార్థనలు చేయడం కష్టతరంగా ఉంటుంది.

## ప్రార్థనకు తప్పు ఉద్దేశం ఉందా?

అంగీకారయోగ్యమైన ప్రార్థనకు దురుద్దేశం అంతరాయం కలిగిస్తుందని యాకోబు సూచించాడు: "మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశముతో అడుగుదురు గనుక మీకేమియు దొరకుటలేదు" (యాకోబు 4:3). "మీ వాంఛలకొరకు వ్యయపరచేలా" అన్నట్టు KJV అంది. స్వార్థంనుండి ప్రార్థన ఉబికితే, దాని ఉద్దేశం మంచిదైయుండదు. ఏదో యొక దానికొరకు మనం దేవుని ప్రార్థించేటప్పుడు "నేను దీనిని ఎందుకు అడుగుతున్నాను?" అని మనలను మనమే అడుగుకొందాం. అలా చేయడంలో, ప్రార్థనకు జవాబురాని కారణాన్ని మనం కనుగొనగలం.

## ముగింపు

ప్రార్థనలకు జవాబులు రానప్పుడు దేవుని నిందించడం ఒక వ్యక్తియొక్క తొలి సహజోద్వేగమైయుండవచ్చు, కాని దానికి యితర అవకాశాలుంటాయి. నిన్ను నీవు పరీక్షించుకో. నీ ప్రార్థనలను పరీక్షించుకో. నీ ఉద్దేశాలను పరీక్షించుకో. వ్యక్తి ప్రార్థనలు, ఉద్దేశాలు అంగీకారయోగ్యమైయున్నప్పుడు, దేవుడు ప్రార్థనలనాలకిస్తాడు. తన చిత్తప్రకారం మనకు జవాబులిస్తాడు, మనకు మేలుకలుగునదేదో దాని ప్రకారం ఆయన జవాబిస్తాడు.

"ప్రభువా ... మాకును ప్రార్థన చేయ నేర్పుము" (లూకా 11:1).